# పొరపాటు

కె.వి.ఎస్.డి.ప్రసాద్

అతగాణ్ణి నేను మొదటిసారి సినిమా హాల్లో చూసేను. ఒంటరిగా వచ్చేడు. ఓ పదిమంది కలిసొచ్చి పిల్లికూతలు, ఈలలు వేసుకుంటూ సినిమా చూసే వయసతడిది. నా ముందు వరసలో కూచోడం మూలాన్ని నేనతణ్ణి సినిమా చూస్తున్నంత సేపూ అప్పుడప్పుడూ చూడగలిగేను. తెర మీద నవ్వొచ్చే సీనొస్తే బిగ్గరగానే నవ్వేవాడు. స్టంటుసీన్లని కన్నార్పకుండానే చూసేవాడు. ఇంటర్వెల్లో బయటకెళ్తూ గుర్తుకోసం వరస నెంబరూ సీటు నెంబరూ లెక్కెట్టుకోవడం కూడా నేను గమనించేను. టీ




పుచ్చుకుని హుందాగా తల కూడా తిప్పకుండా తన సీట్లోనే కూర్చునేవాడు. ఇంకోళ్ళ సీట్లలో కూర్చుని వాళ్ళొచ్చేక సారీలు చెప్పడం నాకూ ఇష్టం ఉండదు.

ఆ తర్వాత మరో రెండుమూడు సార్లతణ్ణి సినిమా హాళ్ళలోనే చూసేను. పరిచయస్తుల్ని పలకరించడంలోనూ, స్నేహితులతో మాట్లాడేటప్పుడూ కూడా అతడిలో వయసుకి మించిన పరిపక్వత, నిబ్బరమూ అగుపించేవి. అతనలా తొణక్కుండా ఉండడం నాకు ముచ్చటేసింది. నేను గమనిస్తున్నట్టు అతనికి తెలియదు. అతడి జుట్టు ఎప్పుడూ కొద్దిగా రేగి ఉండేది. కొంచెం వంగి నడిచేవాడు.

నాకా ఊర్నుంచి ట్రాన్స్ఫరయి మూడేళ్ళయ్యాక మళ్ళీ అతణ్ణి ఈ ఊళ్ళో చూసేను. అతడింకా నాకు గుర్తుండడమే వింత. పరిచయస్థులే నాకంతగా జ్ఞాపకం వుండరు. అతగాడి మొహం కొద్దిగా నల్లబడి రాటుదేలింది. ఎడంపక్క జుత్తు కొంచెం ఊడింది. నుదురు విశాలంగా కనిపిస్తోంది. సైడు బర్న్సు పొడుగ్గా పెట్టేడు. అతడి ప్రవర్తన్లోమటుకు నాకేమీ తేడా వున్నట్టనిపించలేదు. అడపాదడపా మరి మూడేళ్ళపాటతణ్ణి చూస్తూనే వున్నాను.

మా పెద్దమ్మాయికి పందొమ్మిదో ఏడొచ్చింది. మొన్న నామకరణం జరిగినట్లుంది. అప్పుడే బిఎస్సీ సెకండియరుకొచ్చింది. దానికి సంబంధాలు వెతుకుతుంటే ఓ మేనేజరు సంబంధం చెప్పేరు. లక్ష్మీకాంతం చురుకైన కుర్రాట్ట. చిన్నవయసులోనే మంచుద్యోగం వచ్చిందన్నారు.

తీరా పెద్దాయన్ని కలిసి కొడుకుతో ఇంటికి రమ్మని చెప్దామనుగదా, అబ్బాయి నాకు చిరపరిచితుడే.

పెళ్ళి బాగా చేశాను. రెండోవాడు ఇంజినీరింగు రెండో సంవత్సరం. వాడి చదువుకేమీ ఢోకా లేదు కానీ, కొద్దిగా ఋణమూ తీసుకు రావాల్సి రానేవచ్చింది. మా పిల్ల కొంత పెంకిఘటం. ఆ సంగతి పెళ్ళిచూపులప్పుడే పెద్దాయన సమక్షంలోనే అతగాడితో అన్నాను. వాళ్ళిద్దరూ నవ్వేరు. మేమూ నవ్వేము. వాళ్ళెళ్ళాక "దీనికి అత్తపోరు లేద"ని మావిడ సంతోషిస్తే "పోయినావిడ కుర్రాడి తల్లి కూడా కాదే" అని మాత్రం నేనన్నాను.

మా వాడి రెండో సంవత్సరం ఇంజినీరింగు పూర్తయింది. రాజమండ్రి వెళుతుంటే మేనత్తనీ, మొహమాటపడి పైకన్లేదు గానీ దాని కూతుర్ని చూడ్డానికని నా వెంట బడొచ్చేడు. ఇద్దరం ఇంటికి తిరిగొద్దుం....

పెద్దది గుమ్మంలో ఎదురయింది.

విశేషమా నడిగేను. దానికళ్ళెంబడి నీళ్ళొచ్చేయి. వాటిలో నిస్సహాయతకన్న నాకు రోషమూ, చికాకూ కనిపించేయి.

మా అల్లుడు తెగ పొగా, తగని తాగుడూ. పన్లోపనిగా పేకా మొదలెట్టేడు. ఇంటిపట్టున ఉండటల్లేదు. అదీ సారాంశం.

ఆపై నెమ్మదిగా భోజనం దగ్గిరా, రాత్రి పడుకుంటే పక్కన స్టూలేసుకునీ, టిఫిను తింటుంటే పక్కనేకూర్చునీ, సాయంత్రం పూట గాలికని బయటికొస్తే గడపనానుకునీ అదిచేసిన ఆరోపణలన్నీ విన్నాక అతగాడు తాగుడుతోనే ఆగేడా అనిపించింది. వాళ్ళమ్మకి చిన్నప్పట్నుంచే చెప్పాను. గొంతెమ్మ కోర్కెలూ పేకమేడలూ దానికి నేర్పకని. ఆవిడకి కొన్ని కలలున్నాయి. మరి సర్దుకుందో వాటిని అణుచుకుందో అణకువగా నాతో ఉంది. నేను క్యాంపులకెళ్ళినపుడూ ఇంట్లో లేనపుడూ, విననప్పుడూ ఆవిడ తన తీరని కలల్ని సోషలైజ్ చేసి దీనికి చెపుతూండేది. ఆ విషయం నేను పెద్దగా పట్టించుకోకపోవడమే తప్పు. ఈవిడకా మేనేజరుతో లైఫు అంత సాఫుగా లేదుట. ఇంటిముందు లాన్సూ, క్రోటన్లూ వున్న కొంపా, బుల్లి బొచ్చుకుక్కా, కారూ, చాకర్లూ వగైరాలన్నీ ఈవిడక్కావాలి. కొంచెం పెద్దింటివాడు. మనసుపడి చేసుకున్నాడు కాబట్టి అక్కడో చెక్కా, ఇక్కడో నగా, ఓ చిన్న కొంపా అమ్మకొచ్చి తండ్రికేదో సర్ది చెప్పి కొంతవరకూ దీనిక్కావల్సినవి అమర్చేడు.

దీని కవి ఆనటంలేదు.

పుట్టింట్లో దాన్ని గారాబం చేసేనేకాని, ఇవన్నీ మెట్టినింట్లో అయినా వుండగలిగేట్లు చూడగలిగే స్తోమత నా సత్తా పరిధిలో వుందనైనా ఎప్పుడూ అన్నట్లు కూడా నాకు గుర్తులేదు.

వాళ్ళమ్మా, నవలలూ, సినిమాలూ, కొంత దాని బుర్రా దాన్నిలా తయారు చేసేయి.

కేవలం ఇందుకే నేను నొచ్చుకోలేదు.

అతడు తొణకడనుకొన్నాను. కొందరు కొన్నిట్ని కేవలం భయంతో దూరం ఉంచుతారు. దాన్ని నిగ్రహం అనుకోకూడదు మరి.

అతగాడు దీన్తో మనగలడని నేను ఊహించేను.

మితభాషణకూ, మాట్లాడితే లేమీ, లోపమూ బయటపడ్తాయని ముడుచుక్కూర్చోవడానికీ తేడా లేదూ?

నేను పొరబడ్డాను.